# మంచి వార్త

## ఒంటరి స్త్రీ స్ఫూర్తిగాథ



**నాగా తెగకు** చెందిన యాంగ్‌మిలా జిమిక్‌ది మణిపుర్ రాష్ట్రం. దాదాపు పన్నెండేండ్ల పాటు ఆమె ఓ బుట్ట నిండా కూరగాయలు మోసుకుంటూ తన సొంత గ్రామం ఫరుంగ్ నుంచి తమ జిల్లా కేంద్రం ఉఖ్రుల్‌కు రోజూ పొద్దునే ఏడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లేది. అవి అమ్మేసి మళ్లీ తన ఊరికి వచ్చేది. మధ్యాహ్నం తిన్న తర్వాత మళ్లీ కూరగాయలు అమ్మడానికి ఉఖ్రుల్‌కు నడుస్తూ వెళ్లేది. ఆమె ఈ కఠినమైన ప్రయాణం వెనక ఓ చేదు సంఘటన ఉంది. యాంగ్‌మిలా 1991లో తన ఇరవై ఒకటో ఏట పెళ్లి కాకుండానే తల్లయ్యింది. నమ్మిన వాడు పట్టించుకోవడం మానేశాడు. దాంతో పసిబిడ్డతోపాటు, తన తండ్రి బాధ్యత కూడా యాంగ్‌మిలా మీద పడింది. అలా 2002 వరకు ఆమె కూరగాయల వ్యాపారం చేసింది. ఆ తర్వాత కొన్నాళ్లు పాతబట్టల అమ్మకం, ఇంకొన్నాళ్లు కోళ్ల వ్యాపారంలో అదృష్టం పరీక్షించుకుంది. చివరికి 2016లో ఆర్థికంగా స్థిరత్వాన్ని సాధించగలిగింది. ఆ ఏడాది ఆమె ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారంలో అడుగుపెట్టింది. కేవలం 500 రూపాయల పెట్టుబడితో ఈ రంగంలో ప్రవేశించింది. మొదట్లో గూస్ బెర్రీ, మామిడి, అంజీర్ మొదలైన పండ్లను ప్రాసెస్ చేసి క్యాండీలు తయారుచేసి అమ్మేది. స్థానికులను ఈ క్యాండీలు ఎంతో ఆకట్టుకున్నాయి. తర్వాత ఆమె పచ్చళ్ల తయారీపై దృష్టి సారించింది. దీనికోసం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించిన వర్క్‌షాప్‌లో శిక్షణ తీసుకున్నది. ''నేను నా స్టార్టప్‌కు 'శిరిన్ ప్రొడక్ట్స్' అని పేరు పెట్టుకున్నాను. నాగా భాషలో ఈ పదానికి ధనిక, పేద తేడా లేకుండా అందరికీ సుసంపన్నంగా జీవించే అవకాశం ఇవ్వాలి అని అర్థం. మా కార్ఖానాలో పన్నెండు మంది ఉపాధి పొందుతున్నారు'' అని సంతోషంగా, సగర్వంగా చెబుతారు యాంగ్‌మిలా. ఆమె కొడుకు షాంగ్‌రీఫావో ఎమ్మెస్సీ చదువుతున్నాడు. తల్లికి వ్యాపారంలో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. వంచనకు గురైనా కుంగిపోకుండా విధిని ఎదురించి నిలిచిన యాంగ్‌మిలా జీవితం ఓ స్ఫూర్తిగాథ.

## వైతాళికుల వాణి

సరైన అవకాశం కోసం ఎదురుచూడొద్దు. దాన్ని మీరే సృష్టించుకోవాలి.

• జార్జి బెర్నార్డ్ షా

సుప్రసిద్ధ నాటక రచయిత

## క్యా సీన్ హై!

